క్లుప్తంగా

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



వేములవాడలో ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్

కరప: వేసవిలో వడగాడ్పుల బారిన పడకుండా ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు పాలిక శ్రీనివాస్ తెలిపారు. వేములవాడలో మంగళవారం ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు ఆయన సూచనలు చేశారు. ఎండలో ఎక్కువ సమయం పనిచేయరాదని, వడగాడ్పులు తగలకుండా తలకు రక్షణగా టోపీలుగానీ, తువాలుతో తలపాగా చుట్టుకోవాలన్నారు. తాగు నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పని దగ్గరలో టెంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రోజువారీ వేతం రూ.279 వచ్చేలా నిర్దేశించిన కొలతలు ప్రకారం పనిచేయాలన్నారు. ఏదైనా అవసరమైతే వైద్య సిబ్బందికి సమాచారమందిస్తే సహాయం అందిస్తామన్నారు.

తాగునీటి బావి శుభ్రతా పనులు



పాతర్లగడ్డ బావిలో అడుగున బురద మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

కరప: పాతర్లగడ్డ ఎస్సీ వీధిలో తాగునీటి బావిని సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, కార్యదర్శి బి.చంద్రకళ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ బావి నీటిని వినియోగించుకుని ప్రజలు దాహార్తి తీర్చుకుంటున్నారు. వేసవిలో నీరు తక్కువగా ఉంటుంది. దీంతో పంచాయతీ సిబ్బందితో మంగళవారం మంచినీటి బావిలో నీటిని పూర్తిగా తోడించి, అడుగున ఉండే ఊబి మట్టిని తొలగించారు. పూర్తిగా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. బావి చుట్టూ శుభ్రం చేయించినట్లు సర్పంచ్ ఏసుబాబు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పీర్ వెరిఫికేషన్



నడకుదురులో సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

కరప: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల పనితీరుపై పీర్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పీర్ వెరిఫికేషన్ టీమ్‌లో తనతో పాటు, కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్, మరో ముగ్గురు సభ్యులతో పంచాయతీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నడకుదురు, కరప, పెనుగుదురు తదితర గ్రామాల్లో తనిఖీలు చేశామన్నారు. నిర్దేశించిన ప్రమాణాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రేవాటర్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య పనుల నిర్వహణ తదితర అంశాలన్నీ సక్రమంగా జరుగుతున్నాయో లేదో పరిశీలించామని ఈఓపీఆర్డీ తెలిపారు. ఆయా పంచాయతీల పనితీరుపై నివేదిక రూపొందిస్తామన్నారు.

నైతిక విలువలు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా సైన్స్ అధికారి కృష్ణారావు

బాలాజీచెరువు: ప్రతి విద్యార్థికి నైతిక విలువలు అవసరమని ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు, విజయనగరం జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు అన్నారు. వేసవి వినోదంలో భాగంగా మంగళవారం ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒత్తిడి లేకుండా చదవాలని, ముఖ్యంగా క్రమశిక్షణ, మానవత విలువలు కలిగి ఉండాలన్నారు. ఫౌండేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదవు పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, జిల్లా కార్యదర్శి కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిబిరం

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం 5వ రోజు వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. బేసిక్ డ్రాయింగ్, గణితంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా మహిళలకు కుట్టు మెషీన్‌లో మెలకువలు నేర్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు జి.రవివర్మ, టి.జయరాజు, ఎ.దుర్గా పద్మావతి పాల్గొన్నారు.

గురి తప్పకుండా..



డీఎస్ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- రైఫిల్ షూటింగ్‌లో చిన్నారులకు శిక్షణ
- షూటింగ్ అకాడమీలో అవగాహన

నాగమల్లితోట జంక్షన్: దీపావళి వచ్చిందంటే డమ్మీ తుపాకులు పట్టుకుని టేపులు పేల్చుతూ సంబరపడే చిన్నారులు.. దొంగా పోలీస్ ఆటలు ఆడేటప్పుడు శబ్దాలు చేస్తూ నిజంగానే తుపాకీతో కాల్చుతున్నట్లు ఊహించుకుని ఆనందపడే బుడతలు షూటింగ్‌లో శిక్షణ పొందడానికి ఉత్సాహం చూపుతుంటారు. అలాంటి వారి కోసం వేసవి శిక్షణ మొదలైంది. దేశానికి షూటింగ్‌లో పతకాలు తెచ్చిన అభినవ్ బింద్రా, విజయ్, జీతూరాయి, అంజలీభగవత్‌లను స్ఫూర్తిగా తీసుకుని రైఫిల్ షూటింగ్‌పై ఉన్న మక్కువతో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో కోచ్ సమీర్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 7 నుంచి ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా రైఫిల్ షూటింగ్ అకాడమీలో సుమారు 12 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. 10 మీటర్ల రేంజ్ ఉన్న ఈ అకాడమీలో కోచ్ సమీర్ క్రీడాకారులకు రైఫిల్ షూటింగ్‌లో మెళకువలు నేర్పుతున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ శిక్షణ ఇస్తున్నారు. అకాడమీలో రెండు గన్స్, ఒక తుపాకీ ఉన్నారు. వీటితోనే హ్యాండ్ పవర్, బ్యాలెన్స్, ఐసైట్, స్టాండింగ్ పొజిషన్‌లలో తర్ఫీదు ఇస్తున్నారు. అయితే క్రీడాకారులకు మెరుగైన శిక్షణ కావాలంటే షాప్ నుంచి అంతర్జాతీయ స్థాయి 4 రైఫిల్స్, 4 పిస్టల్స్ వంటివి కావాల్సి ఉంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ టార్గెట్‌లు వాడుతున్నారు. మొత్తం 5 ఉండగా అందులో రెండు పాడై మరమ్మతులు చేయక వినియోగంలో లేకుండా పోయాయి. వీటి స్థానంలో ఆధునిక సిస్టమ్ టార్గెట్‌లు ఏర్పాటు చేస్తే మరింత మంది శిక్షణ పొంది పతకాలు సాధించడానికి అవకాశం ఉంటుందని కోచ్ చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఈ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు ఆరు బంగారు, నాలుగు రజత, ఒక కాంస్య పతకం సాధించారు.

ఏకాగ్రత అవసరం



రైఫిల్ షూటింగ్‌లో రాణించాలంటే సహనం, ఓపిక ఉండాలి. ఈ క్రీడ ఏకాగ్రతతో కూడుకున్నది. టార్గెట్‌పైనే దృష్టిసారిస్తే పతకం సాధించడం సులువే. ఈ క్రీడల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

– సమీర్, రైఫిల్ షూటింగ్ కోచ్, డీఎస్ఏ

నాన్న ప్రోత్సాహంతో...



నా పేరు శ్రీయ జీవిత. నేను ఆదిత్య స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నా. జాతీయ స్థాయిలో రైఫిల్ షూటింగ్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం. మా నాన్న ప్రోత్సాహంతో సమ్మర్ క్యాంప్‌లో చేరాను.

– శ్రీయజీవిత, 7వ తరగతి

మూడేళ్లుగా శిక్షణ



నేను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. డీఎస్ఏలో మూడేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించాను. ఐఐటీలో సీటు పొంది కెరీర్‌లో స్థిరపడాన్నది నా జీవిత లక్ష్యం.

– మోహియుద్దీన్ షేక్, ఇంటర్ విద్యార్థి

ముంపు సమస్య నివారణకు ప్రణాళిక



సమీక్షలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో వర్షాకాలానికి ముందు ముంపు నివారణ కార్యాచరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తూర్పు ఏలూరు, పేట కాలువ, గాడేరు పొడవునా కాలువల సర్వేను నీటిపారుదల శాఖ నిర్వహించి, సిల్ట్ తొలగింపు కోసం కమిషనర్ మహేష్‌కుమార్‌కు సమర్పించారు. దీనిపై త్వరలో అంచనాలు సమర్పిస్తామన్నారు. ఈ నెల 29వ తేదీ లోపు ఆయా ప్రాంతాల్లో ముంపు సమస్య నివారణకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలంలో ముంపు బెడద రాకుండా శాశ్వత పరిష్కారం కనుకొనాలని అన్నారు.

మీ సేవలకు వందనం

- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు మీరే
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూరల్‌లో వలంటీర్లకు సత్కారం



సేవా వజ్ర పురస్కారంతో వలంటీర్ కొండేటి ఉషను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా సేవలందిస్తున్న వలంటీర్లకు వందనమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ వద్ద స్పందన ఫంక్షన్ హాలులో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభించారు. మండలంలో సేవా వజ్ర పురస్కారానికి ఇద్దరు, సేవారత్నకు ఇద్దరు, సేవా మిత్రకు 917 మంది కలిపి మొత్తం 928 మంది వలంటీర్లు ఎంపికయ్యారు. తొలిరోజు సోమవారం నేమాం, పండూరు, పి.వెంకటాపురం, పెనుమర్తి, రమణయ్యపేట, సర్పవరం, సూర్యారావుపేట, తమ్మవరం, తిమ్మాపురం, వాకలపూడి, వలసపాకల తదితర 11 గ్రామాలకు చెందిన ఒక సేవా వజ్ర, 8 సేవారత్న, 543 మందికి సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించి, సర్టిఫికెట్లు, మెడల్స్ అందించి ఎమ్మెల్యే సన్మానించారు. ఇందులో సేవా వజ్రకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల చొప్పున అందించనున్నారు.

ఇది మన కుటుంబం

వలంటీర్లతో కూర్చుంటే ఇది మన కుటుంబమనే భావన కలుగుతుందని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. వలంటీర్ వ్యవస్థ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిందన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను పెడుతున్నామని కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చెబితే సాధ్యమా అనుకున్నామని, ఆయన ప్రతి నెలా వేతనం ఇచ్చి రాష్ట్రంలో 2.80 లక్షల మంది వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. నేడు మీరంతా ప్రజల మన్ననలు అందుకుంటున్నారని అన్నారు. వలంటీర్లను చంద్రబాబు చాలా చులకనగా చూడడమే కాకుండా ఇబ్బందికర వ్యాఖ్యలు చేశారన్నారు. వలంటీర్లు ఓ దమ్మున్న వ్యవస్థ అని కొనియాడారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ కార్యకర్తలు ఎన్నో అవకతవకలకు పాల్పడ్డారన్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత వలంటీరే సొంతంగా సొమ్ము ఖర్చు చేయడానికి కూడా వెనకాడడం లేదన్నారు. నియోజకవర్గంలో సుమారు 1,800 మంది వలంటీర్లు ఉండగా వారిలో 70 శాతం మహిళలేనని, బాధ్యతగా పనిచేస్తూ ముఖ్యమంత్రి జగన్‌కు, ఎమ్మెల్యేగా తనకు మంచి పేరు వచ్చేలా పనిచేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, వైస్ ఎంపీపీలు బందిలి వీరీష, గుత్తల సత్తిబాబు, సర్పంచులు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్యప్రకాశరావు, గొల్లపల్లి రాంబాబు, శీలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే వాకలపూడి హార్బర్‌పేటకు చెందిన వలంటీర్ కొప్పిశెట్టి దేవిశ్రీ తన ప్రసంగం ద్వారా ఆకట్టుకున్నారు. జగనన్న మాకు అప్పగించిన 50 కుటుంబాలు తమ కుటుంబాలుగా చూస్తున్నామని, మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలని అన్నారు. నేమాంకు వలంటీర్ అరుణ సీఎం జగన్‌పై పాట పాడి ఆకట్టుకున్నారు. వీరిద్దరికి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



హాజరైన వలంటీర్లు

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ సిటీ: పేదల సౌకర్యార్థం జర్నలిస్టులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్‌తో మరణించిన జర్నలిస్టులను గుర్తించుకుని జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టులందరికీ ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కలెక్టరేట్‌కు వచ్చే కక్షిదారులు, ఫిర్యాదుదారులకు పోలీస్ డిపార్టుమెంట్‌కు చెందిన పెంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోటకూర శ్రీనివాసరావు, నక్కా రవి, జర్నలిస్టులు సలీమ్, ప్రకాష్, చిప్పి, అసోసియేషన్ అధ్యక్షుడు మంగం వెంకట శివరామకృష్ణ తదితరులు మజ్జిగను అందజేశారు.

చెత్త సేకరణకు సహకరించండి



రమణయ్యపేట మార్కెట్‌లో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

- బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయొద్దు
- కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా కాకినాడ నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల ప్రజలను కోరారు. మంగళవారం ఉదయం ఆయన రమణయ్యపేట కాయగూరల మార్కెట్, పేరా్రజుపేటలోని రైతుబజార్, ఆనంద భారతి కాంప్లెక్స్‌ను పరిశీలించారు. వ్యాపారులు ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ కోరారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదన్నారు. ఎవరైనా వేస్తే వారికి జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా చెత్త సేకరణ యూజర్ చార్జీలను బాధ్యతగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సచివాలయ సిబ్బంది వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. పింఛన్లకు సంబంధించిన విషయాల్లో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా జీఎస్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంట్ సహకారంతో నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా సకాలంలో అన్ని సేవలను పూర్తి చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, అసిస్టెంట్ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా రిసోర్స్ పర్సన్లు, 101 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకట్టుకునేలా బీచ్ అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- బీచ్ పార్కు, శిల్పారామం పరిశీలన



బీచ్‌లో యుద్ధ విమాన మ్యూజియం పనులను కలెక్టర్‌కు వివరిస్తున్న కౌడా వీసీ సుబ్బారావు

కాకినాడ రూరల్: సందర్శకులను ఆకట్టుకునేలా సూర్యారావుపేట బీచ్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, రెవెన్యూ, టూరిజం, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో కలసి ఆమె బీచ్ పార్కు, శిల్పారామం, హరిత రిసార్ట్స్, రెస్టారెంట్, ఓపెన్ యాంఫీ థియేటర్, ఫౌంటెన్, ఓపెన్ సైట్లు, ల్యాండ్ స్కేప్, నిర్మాణంలో ఉన్న గదులు, యుద్ధ విమానాల మ్యూజియాన్ని పరిశీలించారు. బీచ్ పార్కు నిర్వహణ మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టూరిజం శాఖ ఈఈ రాజారావు, ఏపీటీడీసీ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఖాళీ స్థలాలు, టూరిజం పరంగా అభివృద్ధిపై తహసీల్దార్ మురార్జీతో మాట్లాడారు. ఖాళీ స్థలాలు, ఏఏ పనులకు ప్రతిపాదించారనే విషయాలను మండల సర్వేయర్ వేణుగోపాలాచార్యులు కలెక్టర్‌కు వివరించారు. యుద్ధ విమానాల మ్యూజియం సందర్శించిన కలెక్టర్, జేసీలు సందర్శకులకు కోసం సిద్ధమవుతున్న టీయూ–142 యుద్ధ విమాన లోపల భాగాన్ని స్వయంగా పరిశీలించారు. జరుగుతున్న పనుల వివరాలను కౌడా వైస్ చైర్మన్ కె.సుబ్బారావు తెలియజేశారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా చేపట్టబోయే పనులకు సంబంధించి డిజైన్‌లను కలెక్టర్‌కు వివరించారు. జూలై నెలాఖరు లోగా పనులు పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఫ్రూట్ పార్కులో పిల్లల వినోదం కోసం ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని, సందర్శకుల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీచ్ పార్కుకు ఎదురుగా ఏర్పాటు చేయబోయే ఈట్ స్ట్రీట్‌కు సౌకర్యాలు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ పార్కుకు దక్షిణం వైపు ఏర్పాటు చేయబోయే గేమింగ్ జోన్‌లో ఫ్లైట్ స్టిమ్యులేటర్, జీరో గ్రావిటీ రూమ్, రోలర్ కోస్టర్ వంటి ఆధునిక వినోద పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ చల్లా కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్, జిల్లా ఇన్‌చార్జ్ కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొంటారన్నారు.

రేపు రోటరీ గవర్నర్ పర్యటన

బోట్‌క్లబ్: కాకినాడకు రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ భాస్కర్‌రామ్ ఈ నెల 25న రానున్నారని క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఓ హోటల్‌లో జరిగిన క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం సాయంత్రం అచ్చంపేటలో రోటరీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీస్తారన్నారు. తర్వాత రోటరీ వృద్ధాశ్రమాన్ని సందర్శించి ఇన్‌మేట్స్‌తో సమావేశమవుతారన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్‌ను సందర్శన అనంతర రోటరీ హాల్‌లో నిర్వహించే క్లబ్ ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారన్నారు. రోటరీ మాజీ గవర్నర్‌లు ఎస్‌వీఎస్‌రావు, అసిస్టెంట్ గవర్నర్ చోడిశెట్టి పద్దరాజు, క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, సభ్యులు దాసరి సాయికృష్ణ, టీవీ బాలకృష్ణ, చారి మ్నార్ వర్మ పాల్గొన్నారు.

ముగిసిన ఆర్పీల శిక్షణ

సామర్లకోట: రామచంద్రపురం మున్సిపాలిటీలో మెప్మా రిసోర్స్ పర్సన్ల శిక్షణ మంగళవారంతో ముగిసింది. సోమవారం నుంచి ఆర్పీలకు రెండు రోజుల శిక్షణ జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ నిర్వహించారు. దీనికి 36 మంది ఆర్పీలు హాజరయ్యారు. బుధవారం నుంచి కాకినాడ కార్పొరేషన్‌లోని ఆర్పీలకు శిక్షణ ఉంటుందని డీఆర్పీ రాజశేఖర్ తెలిపారు.

కొత్త ఎంపీడీఓలకు అవగాహన



సామర్లకోట ఎంపీడీఓకు మొక్కను అందిస్తున్న కొత్తగా ఎంపికైన ఎంపీడీఓలు

సామర్లకోట: రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన ఎంపీడీఓలు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ అంశాలపై శిక్షణ పొందారు. ఆరు నెలల శిక్షణలో భాగంగా ఈ నెల ఒకటి తేదీ నుంచి స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 34 మంది ఎంపీడీఓలు శిక్షణ పొందుతున్నారు. స్థానిక ఎంపీడీఓ డి.శ్రీలలిత వారికి పలు విషయాలు వివరించారు. మండల పరిషత్తు కార్యాలయంలో రికార్డుల తయారీ, పరిశీలన, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, హక్కులు, బాధ్యతల వంటి అంశాలపై శ్రీలలిత వివరించారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో మండల సర్వేయర్‌కు గాయాలయ్యాయి. గండేపల్లి మండలంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లక్ష్మి యల్లమిల్లిలో విధులు నిర్వహించుకుని తన అసిస్టెంట్ షాబుతో కలిసి బైక్‌పై సింగరంపాలెం వెళుతుండగా గండేపల్లిలో కార్పొరేషన్ బ్యాంక్ సమీపంలో ఉన్న వినాయకుని ఆలయం వద్ద ఆగి ఉన్న కారును ఢీకొన్నారు. ఆమె కింద పడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే ఆమెను గండేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందజేశారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

గోకవరం: రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఒక ఎక్స్‌వేటర్, మూడు టిప్పర్లను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు నాగమ్మకు చెందిన సర్వే నెంబర్ 389/16లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతుందని తమకు సమాచారం అందిందన్నారు. ఈ సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి, తవ్వకాలు నిర్వహిస్తున్న ఒక ఎక్స్‌వేటర్, రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. ఆ ప్రాంతంలో 4,827 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వకాలు నిర్వహించినట్టు అంచనా వేశామన్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుమ్మళ్లదొడ్డికి చెందిన మిర్తిపాటి వెంకటనాగజ్యోతి స్వరూప్, భూ యజమాని, ఆపరేటర్లు, డ్రైవర్లు తదితరులపై కేసు నమోదు చేయాలని గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూముల రక్షణకు కంచె

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 99 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈటీసీ భూములలో 55 ఎకరాలు ఇళ్ల స్థలాలకు, ఐదు ఎకరాలు గోదాములకు సేకరించారు. దాంతో ఉన్న భూములను పరిరక్షించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. భూముల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయిలు ఈటీసీలోకి ప్రవేశిస్తున్నారు. దాంతో ఈటీసీ హద్దులలో ఇనుప తీగతో కంచె ఏర్పాటు చేయాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ నిర్ణయించారు. ఈ మేరకు నవదుర్గ ఆలయం వైపు ఉన్న భూముల హద్దులో సిమెంట్ స్తంభాలు వేసి ఇనుప తీగతో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎండ చుర్రుమంటోంది



ప్రత్తిపాడు- సామర్లకోట రహదారి ఇలా..

- అల్లాడుతున్న జనం
- రోడ్లు నిర్మానుష్యం

పెద్దాపురం: భగభగమంటూ భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు.. ప్రజల నెత్తిన సెగలు పుట్టిస్తున్నాడు.. పెద్దాపురం నియోజకవర్గంలో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి మంగళవారం ప్రజలు అల్లాడిపోయారు. రోహిణీ కార్తె ఆరంభం కావడంతో మూడు రోజుల నుంచి వాతావరణం మారిపోయింది. వడగాడ్పులు తీవ్రమయ్యాయి. మధ్యాహ్నమైతే చాలు చాలా ప్రాంతాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వడగాడ్పులు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. జనం తప్పని పరిస్థితుల్లోనే బయటకు వస్తున్నారు. ఉదయం మబ్బు వాతావరణం చూసి కాస్త ఉపశమనం పొందిన ప్రజలకు 11 గంటలు దాటితే ఎండ తీవ్రత అధికం కావడంతో పడరాని పాట్లు పడ్డారు. మధ్యాహ్నమైతే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పెద్దాపురంలో 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ కాకుండా నమోదవుతున్నాయి. అసలే ఉక్కబోతతో ఇబ్బందులు పడుతుంటే.. పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో తరచూ విద్యుత్ కోతలతో జనం విలవిల్లాడుతున్నారు. వేసవి తాపానికి వాహనదారులైతే కాస్త నీడ కనబడితే ఆగి సేదతీరుతున్నారు. రోడ్ల అభివృద్ధి పేరుతో చెట్లు నరికివేయడంతో పట్టణంలో నిలువ నీడ లేక మండుటెండలోనే పరుగులు తీస్తున్నారు. వ్యాపారుల కష్టాలకు ఇక అవధులు లేవు. ఎండ తీవ్రతతో జనం బయటకు రాకపోవడంతో వ్యాపారాలు లేక ఇబ్బంది పడ్డారు.